


*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**సిక్ (కేనియన్)కి** చేరబోయే ముందుగా పెద్ద రాతిలో చెక్కిన మూడు చదరపు బ్లాక్స్, కుడివైపు, ఎడమవైపు కొండ మధ్యలో చెక్కిన చిన్న ఆలయాలులాంటివి కనిపించాయి. వాటిని చూపించి జీనత్ చెప్పింది.

"అవి ఆలయాలు కాదు సమాధులు. వీటిని ప్రిక్లీనియం అంటారు. అంటే నబాటీ భాషలో 'శవాలని ఉంచే చోటు' అని అర్థం. మరణించిన వారి జ్ఞాపకార్థంగా నెబాటియన్స్ పిరమిడ్స్‌ని నిర్మిస్తారు. ఆ సమాధిలో పాతిపెట్టబడ్డ కుటుంబ పెద్ద దుప్పటి కప్పుకున్న విగ్రహం ఇది. సమాధి కింద బెంచీలు గల ఫ్యునరల్ డైనింగ్ హాల్ కూడా చెక్కారు చూడ్మండి. పితృ దేవతల గౌరవార్థం ఇక్కడ అతిథులకి వైన్, ఆహారం ఇచ్చేవారు. ఇక్కడ మొత్తం ఐదుగురి సమాధులు ఉన్నాయి. ఆ విగ్రహం వారికోసం సింబాలిక్‌గా చెక్కినది. నబాటియన్ సమాధులు చెక్కబడ్డ ఈ ప్రదేశానికి 'స్ట్రీట్ ఆఫ్ ఫసేడ్స్' అనే పేరు. శవాన్ని పాతిపెట్టడం లేక కాల్చడం కాక ఇలాంటి ఆలయాలని కొండల్లో తొలిచి వాటిలో శవాలని భద్రపరిచేవారు. కారణం వారు మరణానంతర జీవితాన్ని నమ్మేవారు. మరణించబోయే ముందు ఎవరికి వారు వీటిని ఏర్పాటు చేసుకునేవారు. సామాన్యులకి కాక ఇది ధనవంతులకే సాధ్యమయ్యేది. ఇది చిన్న గుహ కాబట్టి ఇది ఆనాటి ఓ తెగ నాయకుడిదని పురాతత్వ శాస్త్రజ్ఞులు చెప్తారు. నబాటియన్స్ భాషలో ఇలాంటి పిరమిడ్స్‌ని నెఫెష్ అంటారు. పరీక్షగా చూస్తే ఇక్కడి ఆలయాల ఫసేడ్ (బయటికి కనిపించే భాగం)లో తేడాలు స్పష్టంగా కనిపిస్తాయి. అది ఈజిప్ట్ - రోమన్ ఆర్కిటెక్చర్. ఇటు వైపుది గ్రీక్ ఆర్కిటెక్చర్. కాబట్టి ఇవి ఆ పీరియడ్స్‌కి చెందినవని ఊహించవచ్చు."

"లోపల శవాలు ఇంకా ఉన్నాయా?" అడిగాను.

"లేవు. దొంగలు ఎత్తుకెళ్ళిపోయారు."

అక్కడ పని వాళ్ళు దారి శుభ్రం చేసి చెత్తని కాలుస్తున్నారు. ఎదురుగ ఓ గుహకి రాతి మెట్లు కనిపించాయి. క్రీ.శ. ఒకటో శతాబ్దంలో రోడ్ మీద పరిచిన లైమ్ స్టోన్స్ ఇప్పుడు కూడా అక్కడక్కడా కనిపించాయి.

ఎటు చూసినా కొండలు, వాటిలో మానవ నిర్మిత సహజ గుహలు ఉన్నాయి. ఆ అతి పురాతన మార్గంలో నడవడం ఓ అందమైన అనుభవం అనిపించింది.

దారిలో వచ్చే పోయే జట్కా బళ్ళు మాకు చాలా తారసపడ్డాయి. కొందరు జట్కా వాళ్ళు పోటీలు పడి గుర్రాలని కొరడాతో కొడుతూ బళ్ళని వేగంగా పోనిస్తూంటే దారిలో దుమ్ము లేవసాగింది. ఇలాంటి బళ్ళ వాళ్ళని చూస్తే టూరిస్ట్ పోలీసులకి ఫిర్యాదు చేసి, జంతువుల పట్ల క్రూరత్వాన్ని నివారించమని టిక్కెట్ వెనక ఎందుకు రాసారో అర్థమైంది.

దాదాపు నలభై ఐదు నిమిషాలు నడిచాక మార్గం అంతమై, ఎదురుగా దాదాపు నలభై మీటర్ల ఎత్తులో ఎర్ర రాతి కొండని తొలిచి కట్టిన ఓ పురాతన భవంతి కనిపించింది. దాని ముందు చతురస్రాకారపు స్థలం. అక్కడ అనేక ఒంటెలు పడుకుని ఉన్నాయి. బళ్ళల్లో

వచ్చిన మాతోటి వారంతా ఆ భవంతికి ఎదురుగా ఉన్న విశాలమైన ప్రదేశంలో కూర్చుని కనిపించారు. అందర్నీ దగ్గరికి రమ్మని జీనత్ దాని గురించి వివరించింది.

"దీని పేరు అల్ ఖజానా. అంటే ట్రెజరీ. క్రీ.పూర్వం 116లో సేండ్ స్టోన్ కొండని తొలిచి నబాటియన్స్ దీన్ని చెక్కారు. చూడండి. ట్రెజరీలో కింద అంతస్థులో ఆరు పెద్ద స్థంభాలు, పై అంతస్థులో ఆరు చిన్న స్థంభాలు చెక్కారు. స్థంభాల ఆధారంగా రెండంతస్థుల రూఫ్ నిలబడ్డట్లుగా చెక్కారు. ముందు ఫసేడ్‌ని అలంకారంగా చెక్కారు. దీన్ని ఎందుకు నిర్మించారో ఇంకా అంతుపట్టకపోయినా అది నబాటియన్ రాజు అరితాస్ - 4(9బిసి - 40 ఏడి)కి చెందిన మసోలియంగా భావిస్తున్నారు. తర్వాత కింగ్ ఫారోస్ ఈజిప్ట్ నించి ఇక్కడికి వచ్చాడని, ఇందులో బంగారు నాణాలు, ఇతర సంపద దాచాడని నమ్మి వాటికోసం కొందరు తుపాకులతో కాల్చారు. చూడండి. గోడలమీద మీకు గుళ్ళు దిగిన రంధ్రాలు కనిపిస్తాయి. కానీ మట్టి రాలిపడింది తప్ప బంగారం కనిపించలేదు."

ఆ అద్భుతమైన చెక్కడాన్ని పరిశీలించి చూసాను. ఆల్ ఖజానాకి ఫసేడ్ ఉంది. కోరింతియన్ స్టయిల్‌లో అలంకరించబడిన కొన్ని విగ్రాహాలు కూడా దాన్లో చెక్కారు. రూఫ్ మీద మళ్ళీ అలంకారంగా చెక్కిన శిల్పాలు, వాటికి గోపురాలు. రెండు స్థంభాల మీద గోపురాలు. 2,600 సంవత్సరాల క్రితం ఎలాంటి యంత్రాలు, ఆధునిక సామాగ్రి లేకుండా సాధారణ పరికరాలతో కొండని తొలిచి వీటిని అంత అందంగా నిర్మించడం అద్భుతం. దాని ప్రవేశ ద్వారానికి అటు ఇటు అరుగులు. కింది అంతస్థులో స్థంభాల మధ్యనించి లోపలికి పెద్ద గదిని తొలిచారు. అది ఎంత పెద్దదో, ఎంత విశాలమైందో తెలుసుకోవడానికి లోపలికి అనుమతి లేదు.

"పై అంతస్థు మధ్యలో రెండు స్థంభాల మధ్యగల శిల్పం కనపడుతోందా? అది క్వీన్ హిల్డాది. ఈ విగ్రహానికి తలని పగలకొట్టేసారు. లోపల మూడు సమాధులు ఉన్నాయి. అవి అరితాస్ 1, అరితాస్ 2, అరితాస్, 3 సమాధులు. నిజానికి ఇది ట్రెజరీ, సమాధి తప్ప నివాసగృహం కాదు. ట్రెజరీ కింద అండర్ గ్రౌండ్‌లో మరో అంతస్థు ఉందని పురావస్తు పరిశోధకులు నమ్ముతున్నారు." జీనత్ చెప్పింది.

కిందికి చూస్తే అండర్ గ్రౌండ్‌లో తవ్విన భాగం నించి దానిపై అంతస్థు పై భాగం కొంత కనిపించింది.

"ఆ తవ్వకం ఇంకా పూర్తికాలేదు. పెత్రా నగరంలో కేవలం అయిదు శాతం మాత్రమే ఇంతవరకూ వెలికి తీయబడిందని నమ్ముతున్నారు. పెత్రాకి జ్యూవెల్ ఆఫ్ జోర్డాన్ అని ముద్దు పేరు. జోర్డాన్‌లో చూడదగ్గ ప్రధాన పర్యాటక స్థలం ఇది. జోర్డాన్ ఎడారిలో, పూడిపోయి వెలికి తీయబడ్డ ఈ పురాతన నగరాన్ని చూడటం మీ అదృష్టం. సోమ, బుధ, గురువారాలు మాత్రమే వచ్చి చూడొచ్చు. ఇండియానా జోన్స్ అండ్ ది లాస్ట్ క్రూసెడ్ సినిమాని మీలో ఎంతమంది చూసారు?" జీనత్ అడిగింది. నాతో సహా కొందరం చేతులు ఎత్తాం.

"అందులోని ముఖ్యమైన సన్నివేశాలని ఇక్కడే చిత్రీకరించారు. పెన్ స్టేట్‌కి చెందిన అమెరికన్ ఏంత్రోపాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ ఏన్ బిడెల్ 1921లో ఇక్కడ తవ్వకాల్లో పాల్గొంది. ఇక్కడేకాక ఈమె నార్త్ ఇరాక్‌లోని నైన్ వెహ్‌లో, సిరియాలోని టెల్ అహ్మద్‌లో ప్రాచీన తవ్వకాల్లో పాల్గొంది. నబాటియన్ రాజధాని ప్రాచీన పెత్రా మేప్‌ని ఈమె 1921లో తయారు చేసింది. క్రీ.శ 363లో భూకంపం వల్ల మాయమైన పెత్రా ప్రధాన ఆలయాన్ని తవ్వి తీయడానికి నాలుగేళ్ళపాటు ప్రొఫెసర్ ఏన్ బిడెల్ సహాయం చేసింది. ఆమె బిడావుల్ (స్థానిక) వర్కర్స్‌తో ఇక్కడ తవ్వకాలు జరిపి మనకి కనిపించే ఆ చతురస్రపు పెడస్టల్‌ని, రెండు మీటర్ల ఎత్తైన సేండ్ స్టోన్ పునాదిని, సెరామిక్ పైప్ లైన్స్‌ని కనుగొంది. ఆ విధంగా పూర్తిగా తవ్వాక ఈ ట్రెజరీ కనుగొనబడింది. నెబాటియన్స్‌కి వాన నీటికి వత్తిడిని కల్పించి, శుద్ధిపరిచి కాలువల ద్వారా ప్రవహింపచేసే విద్య క్రీస్తు పూర్వం 6వ శతాబ్దంలోనే తెలుసు. వర్షపు నీటిని వందల కొద్దీ పంపుల ద్వారా తరలించి కొండల్లో నిల్వచేసి, అన్ని కాలాల్లో స్నానానికి, తాగడానికి ఆ నీటిని ఉపయోగించారు."

ఆమె చెప్పడం ఆగాక నేను పక్కనే ఉన్న షెడ్‌లోని సూవెనీర్ షాప్‌ని చూసాను. అందులో అనేక రకాల హస్తకళా వస్తువులు ఉన్నాయి. సేండ్ స్టోన్‌తో చేసిన ట్రెజరీ మీనియేచర్‌ని చందన పది డాలర్లకి బేరమాడి కొంటూంటే మేమూ ఒకటి కొన్నాం. జైన్ మతానికి చెందిన ఆమె బేరం ఆడటంలో దిట్ట.

"ఇది పెత్రా నగరానికి ప్రవేశం మాత్రమే. ముందుకి వెళ్తే మరి కొన్ని చూడచ్చు. కొన్ని చోట్లకి కంచర గాడిద మీదే వెళ్ళగలం. పదండి" జీనత్ చెప్పింది.

గుర్రపు బళ్ళు అంతదాకానే. అక్కడనించి మళ్ళీ రెండున్నర కిలోమీటర్లు లోపలికి నడవాలి. అంతా ఆమెని అనుసరించి ట్రెజరీకి కుడి పక్కనించి కొనసాగే మార్గంలో ముందుకి సాగాం. ఇంక ఎక్కడా నీడలేని మార్గం అది.


కొండల్లో తవ్విన సహజ గుహలు, శిథిలాలు

ముందుకి వెళ్తే మధ్యలో నేలమీద ఇసక ఉన్న మార్గం. అటు ఇటు పురావస్తు పరిశోధనలో బయటపడ్డ కొండల్లో తవ్విన సహజ గుహలు, తొలచిన శిథిలాలు విస్తారంగా కనిపించాయి. మరికొంత దూరం వెళ్తే కొండలో చెక్కిన ఏంఫీ థియేటర్, అందులో అనేక వరసల్లో రాళ్ళతో చెక్కిన సీట్లు, వాటి మధ్య నడవడానికి దారులు కనిపించాయి. నాలుగువేలమందికి సరిపడే సీట్లు అవి. ఏంఫీ థియేటర్‌లో పక్కపక్కనే జంట స్థంభాలు ఉన్నాయి. ఒకప్పుడు దానిమీద కప్పు ఉండేది అని జీనత్ చెప్పింది.

మరి కొంత దూరంలో దారికి కుడివైపున్న మూడో శతాబ్దానికి చెందిన రోమన్ స్థంభాల దగ్గర జీనత్ ఆగి చెప్పింది.

"అప్పట్లో ఇదో వీధి. ఈ ఆరు స్థంభాలని నబాటియన్స్ నిర్మించారు. వీటిని నింఫాయన్స్ అంటారు. తర్వాత రోమన్స్ ఈ వీధిని అభివృద్ధి చేసారు. ఈ వీధిని కొలనాడెడ్ స్ట్రీట్ అని పిలుస్తారు. పెత్రా నగరంలో ఆ రోజుల్లో ఇది ప్రధాన ప్రాచీన మార్కెట్ వీధి. ఇక్కడి పిస్తాషియో (పిస్తాపప్పు) చెట్లు 450 ఏళ్ళ క్రితంవి."


ఆ రోమన్ స్థంభాలు, దాని పక్కన గల రోడ్డు పూర్వం మేము టర్కీలోని కుశదాసిలో చూసిన ప్రాచీన ఎఫెసస్ నగరంలో క్లియోపాత్రా నడిచిన ప్రదేశానికి డూప్లికేట్‌లా అనిపించింది.

రోమన్ ఎంపైర్ మొత్తం 2,214 సంవత్సరాలు నిలిచి ఉంది. వారి సైన్యం, అడ్మినిస్ట్రేషన్ చాలా సమర్ధవంతమైందిగా ఉండేది. కలిగులా, నీరోలాంటి క్రూర రోమన్ చక్రవర్తులు ఆ సామ్రాజ్యాన్ని పాలించారు. నేరస్థులని, బానిసలని, మరికొందరిని బలవంతంగా ఒకరితో మరొకర్ని పోట్లాడి చంపించే ఆటవిక ఆటని రోమన్ పరిపాలకులు కనిపెట్టారు. (రోమన్‌లోని ఇవి జరిగే కొలోజియాన్ని నేను 1989లో చూసాను) వాళ్ళ మీదకి ఆకలిగొన్న కుక్కలని, పులులని ఉసిగొలిపి వారి పోరాటాన్ని, చివరకి అవి ఆ మనిషిని చీల్చి తినడాన్ని, బతికిన వారిని నిలువునా మంటపెట్టి కాల్చి చంపడాన్ని చూసి వినోదించేవారు. ఆ రోజుల్లో యు.కె.కి బ్రిటానియా అని, స్పెయిన్‌కి హిస్పానిక్ అని, ఫ్రాన్స్‌కి గల్లియా అని, గ్రీస్‌కి అబియా అని, మిడిల్ ఈస్ట్‌కి జుడా అని పేరు. నేటి పశ్చిమ యూరప్, ఆఫ్రికా ఖండంలోని ఉత్తర సముద్రతీర ప్రాంతం కూడా రోమన్ పరిపాలనలో ఉండేది.

క్రీ.శ 184లో రోమన్ సామ్రాజ్య పతనం ఆరంభమై, 476లో మార్కస్ జారెలియస్ మరణానంతరం వెస్టన్ రోమన్ సామ్రాజ్యం అంతమైపోయింది. రోమన్ సామ్రాజ్యం ఎందుకు పడిపోయింది అనే అంశం మీద అనేక థియరీలు ఉన్నాయి. ఓ అంటు వ్యాధి వల్ల ఆ

సామ్రాజ్యం నాశనమైందన్న థియరీకి సాక్ష్యం ఇటీవల లభించింది. 2001లో రీసెర్చర్స్ క్రీ.శ 450 నాటి ఎముకలకి డి.ఎన్.ఏ టెస్ట్ చేసి వారు మలేరియా బారిన పడి మరణించారని తెలుసుకున్నారు.

మరికొంత దూరం నడిచాక కుడివైపున్న ఓ చక్రవర్తి సమాధిని చూపించి జీనత్ వివరించింది.



ట్రెజరీని పోలిన కొరియాంథియన్ టోంబ్

"క్రీ.శ. 47లో బిషప్ జాసన్ దాన్ని చర్చిగా మార్చాడని గ్రీక్ బైజాంటైన్ శిలాఫలకం తెలియచేస్తోంది. అక్కడి కొండల్లో తొలవబడ్డ ది సిల్క్ టోంబ్, కొరియాంథియన్ టోంబ్ (ఇది ట్రెజరీని పోలి ఉంది) ది పేలస్ మాన్యుమెంట్‌లని కూడా కనుగున్నారు. లోయకి ఆవలివైపు గల నీటి టేంక్‌లోంచి ఇక్కడికి నీరు అందేది. ఐదో శతాబ్దంలో నిర్మించిన ఈ శిథిల చర్చ్‌లో మొజాయిక్ ఫ్లోర్ మాత్రమే నిలిచి ఉంది. ఆ చివర కసర్ హెల్బేన్ పేలస్ ఉంది. దీని నిర్మాణం వెనక ఓ కథ ఉంది. ఆ నాటి రాజు తన అల్లుడు గౌరవార్థం కసర్ హెల్బేన్‌ని నిర్మించాడు. ఆ రాజు కూతురు హిల్డా తండ్రితో 'ఇక్కడ నీళ్ళులేవు. కాబట్టి నీటి వసతిని కల్పించే వ్యక్తినే నేను పెళ్ళి చేసుకుంటాను' అని చెప్పింది. రాజు అది చాటించగానే అనేక ప్రాంతాల నించి యువకులు వచ్చి అనేక ప్రయత్నాలు చేసారు. కానీ ఎవరూ సాధించలేకపోయారు. చివరికి ఓ అందమైన యువకుడు వచ్చి వాడి మూసా నది నించి (గుర్తుందిగా? ఇక్కడికి వస్తూ చూసాం. మోసెస్ ఆ నీటి బుగ్గని ఎడారిలో సృష్టించాడు) భూమిలో పైపులు వేసి ఈ పెత్రా నగరం మధ్యకి ఆ నీటిని మళ్ళించాడు. రాజు అతన్ని అల్లుడిగా చేసుకున్నాడు."

దారికి అటు ఇటు స్థానికులు కొందరు కూర్చుని ఉన్నారు. పర్యాటకుల మీద ఆధారపడి జీవించే వారంతా ఆటవికులు. పురాతన నబాటియన్, రోమన్ నకిలీ నాణాలని అమ్మేవారు రోడ్డు పక్కన అక్కడక్కడా కనిపించారు.

"వీరి దగ్గర నిజమైన నాణాలు ఉండే అవకాశం కూడా ఉంది. వాటిని వెలికి తీయడానికి పురాతన సమాధుల్ని, భవంతులని తవ్వుతారు. అవి కొనడం అంటే పురావస్తు వస్తువులని చట్టవ్యతిరేకంగా దొంగిలించడమే" జీనత్ హెచ్చరించింది.



రాళ్ళని అమ్మటానికి కూర్చున్న పిల్లవాడు


పెద్దవాళ్ళేకాక ఆరేళ్ళ పిల్లలు కూడా చక్కటి ఇంగ్లీష్ మాట్లాడుతున్నారు. స్కూల్ విద్యలేదు. పర్యాటకుల నించే ఆ ఇంగ్లీష్ నేర్చుకున్నారని తెలిసి ఆశ్చర్యపోయాను. (ఆగ్రాలోని ఓ ఎనిమిదేళ్ళ కుర్రాడు తాజ్ మహల్ గురించి ఇంగ్లీష్, అనేక యూరోపియన్ భాషల్లో ఏకధాటిగా చెప్పే వీడియో వాట్సప్‌లో ఎవరో పంపితే చూసాను. పిల్లలు ఇలాంటి చోట్ల భాషలని త్వరగా నేర్చుకుంటారు) ఇలాంటి చోట్ల ఉండే చదువురాని హాకర్స్ చాలా తెలివైనవాళ్ళు. ఓ చోట రెండేళ్ళ పిల్లవాడు రంగుల పిచ్చి రాళ్ళని గోనె పట్టామీద ఉంచి అమ్మడానికి కూర్చున్నాడు. అంత మండుటెండలో వాడు అక్కడ కూర్చోవడం నాకు బాధకలిగింది. వాడికి ఓ దినార్ ఇచ్చాను. వాడికి ఆ నాణెం విలువ కూడా తెలీని వయసు.

కొద్ది దూరంలోని చతురస్రాకారపు కట్టడాల వైపు నడిచాం. అది కనీసం పద్దెనిమిది మీటర్ల ఎత్తు ఉండేదని భావించే గ్రేట్ టెంపుల్ కాంప్లెక్స్. అందులో నేడు కేవలం శిథిలాలు మాత్రమే మిగిలాయి.

"దీన్ని క్రీ.పూ 1వశతాబ్దంలో, అంటే ఈ నగర నిర్మాణం జరిగినప్పుడు నిర్మించారు. కసర్ అల్‌బింట్ అనే ఈ చదరపు మాన్యుమెంట్ పెత్రాలోని ప్రధాన ఆలయం. 23 మీటర్ల ఎత్తు గల దీంట్లోకి 23 పాలరాతి మెట్లు ఎక్కి చేరుకోవాలి. ఈ సేండ్ స్టోన్ శిఖరం మీద నబాటీయన్స్ క్రీ.శ 25 - 75లో ఒక దానిమీద మరొకటిగా రెండు మాన్యుమెంట్స్‌ని చెక్కారు. పై దాని పేరు ఒబ్లిస్క్‌టోంబ్. దీనిమీద నాలుగు పిరమిడ్స్ ఉన్నాయి. దీని ఎదురుగా కొండ శిఖరం మీద అదమాంకో అనే గ్రీక్ పూర్వీకుల సమాధులు ఉన్నాయి. అక్కడి గ్రీక్ భాషవల్ల ఆ రోజుల్లో పెత్రా కాస్మోపాలిటన్ నగరం అని తెలుస్తోంది." జీనత్ చెప్పింది.

ఆ రోమన్ స్ట్రీట్ నించి ప్రొపిలియంకి, అంటే పెత్రా గ్రేట్ టెంపుల్ కాంప్లెక్స్‌కి వెళ్ళేందుకు మెట్లున్నాయి. 1992 అమెరికాకి చెందిన బ్రౌన్ యూనివర్సిటీ ఇక్కడ 37,808 చదరపు అడుగుల మేర తవ్వకాలని జరిపింది. ఇందులో పెట్రా గ్రేట్ టెంపుల్ విస్తీర్ణమే 24,803 చదరపు అడుగులు. రోమన్ స్ట్రీట్‌కి దక్షిణ దిక్కున కొలోనాడెడ్ స్ట్రీ చివర్లో ది ట్రెమనోస్ గేట్ ఉంది. ఇది ఓ ఆలయానికి దారి. ఇక్కడ పూర్వపు నబాటియన్ గేట్ స్థానంలో రోమన్స్ దీన్ని క్రీ.శ 125 -225లో నిర్మించారు. ఆ రోజుల్లో అది ఎలా ఉండేదో చూపించే లైన్ డ్రాయింగ్స్ కూడా అక్కడ బోర్డ్ మీద ఉన్నాయి. రోమన్స్ ఈ ప్రాంతానికి రాకముందు ఇక్కడ ఖలీఫాలు పాలించేవారు.


మరికొంత దూరం నడిచాక అక్కడ స్పైసెస్, మెడికల్ టీలు అమ్మే దుకాణాలు కొన్ని కనిపించాయి. ధరని బట్టి క్వాలిటీ మారుతూంటుంది. పహాడీ (కొండజాతి) మనుషుల్లా కనిపించే వారు మమ్మల్ని చుట్టుముట్టి మోనాస్ట్రీకి తీసుకు వెళ్తామని, తమ వెంట రమ్మని ఇంగ్లీష్‌లో కోరసాగారు.




"ఇక్కడ ప్రధానంగా చూడాల్సింది ట్రెజరీ, మోనాస్ట్రీ మాత్రమే. 47 మీటర్ల వెడల్పు, 51 మీటర్ల ఎత్తు గల పెద్ద హాల్ గల మోనాస్ట్రీ 2వ శతాబ్దంలో నిర్మింపబడింది. దీన్ని కింగ్ రాచెల్ 2 నిర్మించాడు. ఈ ఆలయాన్ని క్రిస్టియన్స్ మోనాస్ట్రీగా, చర్చ్‌గా మార్చారు. కొండపైన ఉన్న మొనాస్ట్రీని చూడడానికి మెట్లెక్కి వెళ్ళొచ్చు. కానీ మనకి కాలి నడకన మోనాస్ట్రీకి వెళ్ళొచ్చేందుకు సమయంలేదు. అదికూడా చూడటానికి అచ్చం ట్రెజరీలానే ఉంటుంది. ఇంకో ట్రెజరీని చూసినట్లు మీరు ఫీలవుతారు. కంచరగాడిద మీద వెళ్తే టైంకి తిరిగి రావచ్చు. మీలో ఎవరెవరు వెళ్తారు?" జీనత్ అడిగింది.

ఏడుగురు కంచర గాడిదల మీద వెళ్తామని చెప్పారు. అలసిపోవడంతో పద్మజ ఆ ఎండలో ఇక నడవలేనంది. గాడిదని ఎక్కడానికి ఇష్టపడలేదు. డాక్టర్ సింహాద్రి వెళ్ళారు. ఆయన భార్య చంద్ర, వారి కొడుకు విజయ్ వెళ్ళలేదు. నేను పద్మజ కోసం ఆగిపోయినట్లే చంద్రకోసం విజయ్ ఆగిపోయాడు.

"మీరు పన్నెండుకల్లా ఇక్కడున్న ఏకైక రెస్టారెంట్‌కి లంచ్‌కి రావాలి. గాడిదల వాళ్ళకి మిమ్మల్ని అక్కడ దింపని చెప్తాను. లంచ్ అయ్యాక వెనక్కి బయల్దేరుతాం." జీనత్ రెస్టారెంట్ ఎక్కడ ఉందో చేత్తో చూపించి చెప్పింది.




మేము ఆమె వెంట నడిచి పది నిమిషాల్లో రెస్టారెంట్‌కి చేరుకున్నాం. ఎక్కడో చదివింది ఇక్కడ ప్రస్తావిస్తాను. ఓ మనిషి సగటుని ఓ ఏడాదిలో తన బరువుకి పదహారు రెట్ల ఆహారపదార్థాలని తింటాడు. ఎక్సర్‌సైజ్ చేసే ఓ గుర్రం తన బరువుకి కేవలం ఎనిమిది రెట్ల ఆహారమే తింటుంది. మనిషి గుర్రంలా ఆరోగ్యంగా ఉండాలంటే తక్కువ ఆహారం తిని, పరిగెత్తాలి.

రెస్టారెంట్‌లో వెనక కొండే గోడ. కొండకున్న పెద్ద గుహని డైనింగ్ హాల్‌లా అమర్చి ఆ కొండకి ఆనించి వేసిన డేరాలో టేబుల్స్, కుర్చీలు వేసి రెస్టారెంట్‌లా వాడుతున్నారు. జోర్డాన్‌లోని మరో చిత్రం ఏ వస్తువుకీ ఫిక్స్‌డ్ రేట్ లేకపోవడం. 'కోకోకోలా ధర రెండు డాలర్లు అని చెపితే, మౌంటెన్ డ్యూ లేదా స్ప్రైట్ ఇవ్వమంటే దాని ధర మాత్రం మూడు డాలర్లు అని, మనకి కావల్సింది పెంచి చెప్తారు. ఇలా ఏది కావాలంటే దాని ధరని పెంచుతారు. రెస్టారెంట్‌లో కోక్ ధర రెండు డాలర్లు అని చెప్పాడు. నేను పెప్సీ అడిగితే మూడు డాలర్లని చెపితే తీసుకోలేదు. చందనకూడా తర్వాత నాకు ఈ విషయంలో అదే అనుభవం చెప్పింది.

మొనాస్ట్రీకి వెళ్ళినవారికోసం వేచి ఉన్నప్పుడు హోటల్ బయట ఓ గుర్రం వాడు కనిపించాడు.

"ఇక్కడ రోజుకి ఎంత సంపాదిస్తావు?" అని అడిగితే, అతను చెప్పిన జవాబు అలాంటి చోట నేను ఎదురు చూడలేదు.

"బీయింగ్ రిచ్ ఈజ్ ఇన్ ది మైండ్" అని ఇంగ్లీషులో చెప్పాడు.

ప్రభుత్వం సమీప గ్రామంలో తనకో ఇల్లు ఇచ్చిందని, కానీ తను సమీపంలోని కొండ గుహలో ఉంటానని, ఆ గుహని శుభ్రంగా ఉంచుకుంటానని, ఏభై కుటుంబాలదాకా అక్కడ కలిసి నివశిస్తున్నామని చెప్పాడు. పదిహేడేళ్ళ ఆకుర్రాడి ఏక్సెంట్ అమెరికన్ ఏక్సెంట్. అధికంగా వచ్చే పర్యాటకులు అమెరికన్స్ కాబట్టి వారి నించి ఇంగ్లీష్‌ని, వారి ఉచ్చారణని నేర్చుకున్నాడు. గ్రామంలో ఎందుకు నివశించడంలేదని అడిగితే, 'లివింగ్ వి నేచర్' అని జవాబు చెప్పాడు.

జీనత్‌ని ఏ దేశం పర్యాటక బృందం ఎక్కువ ఇబ్బంది పెడతారని అడిగాను. 'ఫ్రెంచ్ వాళ్ళు' అని జవాబు చెప్పింది. తను స్లోవేకియన్స్ గ్రూప్‌తో ఓసారి బస్సులో వెళ్ళేప్పుడు డిసెంబర్ చలిలో రోడ్డుమీద నడుస్తూ ఇబ్బంది పడే ఇద్దరు ఫ్రెంచ్ వారిని చూసి బస్ ఎక్కించుకుంటారా?' అని అడిగితే ఫ్రెంచ్ వాళ్ళు చాలా నిర్దయగా 'నో' అన్నారని చెప్పింది. అదీకాక ఓసారి మేము దిగిన హోటల్‌లోనే దిగిన ఫ్రెంచ్ వాళ్ళు రూమ్స్ ఇంకా రెడీ కాలేదు అన్న కారణంతో కౌంటర్ మీదకి దూకి రిసెప్షనిస్ట్‌ని కొట్టారట. జీనత్ భయంతో కిచెన్‌లో దాక్కుందిట. ఆ సంఘటన ఆమెకి గుర్తుండిపోయింది.

రెస్టారెంట్‌లో హబీబీ అనే ఓ అరబిక్ పాట వినిపించింది. హబీబీ అంటే అరబిక్‌లో 'ప్రియతమా' అని అర్థం. వేటూరి ఓ తెలుగు పాటలో దీన్ని ఉపయోగించారు. జోర్డానియన్స్‌కి బాలీవుడ్ సినిమాలన్నా, పాటలన్నా ఇష్టం అని జీనత్ చెప్పింది. వర్కర్స్ పన్నెండు కల్లా బఫే లంచ్‌కి ఏర్పాట్లు పూర్తిచేసారు. మీకు తెలుసా? ప్రపంచంలోని 75శాతం ఆహారం పన్నెండు మొక్కలనించి, ఐదు జంతు జాతులనించే లభిస్తోంది. పన్నెండుకి కొందరు తిరిగి వచ్చారు. మొనాస్ట్రీని చూడకపోయినా ఫర్వాలేదని, అది ట్రెజరీలానే ఉందని ఎండలో అలిసిపోయి వచ్చిన వాళ్ళు చెప్పారు. పన్నెండుం పావు కల్లా అందరూ వచ్చేసారు.

"మొనాస్ట్రీ కూడా చక్కటి శిల్ప సంపదతో ఉంది. కానీ అది కూడా ట్రెజరీలాగే ఉంది. ట్రెజరీకి ఆరు స్థంభాలుంటే దానికి నాలుగే ఉన్నాయి. మా అమ్మాయి సౌదామిని గాడిద మీంచి పడింది." తిరిగి వచ్చాక అగర్వాల్ చెప్పారు.


అడిగి ఫోటో తీయించుకున్న దీమ

గాడిద మీద కూర్చోవడం కూడా కళే. దాన్ని నడిపేవాడు చెప్పినట్లు కూర్చోవాలి. హిమాలయాల్లో గంగోత్రి నించి గోముఖానికి కంచర గాడిద మీద వెళ్ళి రావడం గుర్తొచ్చింది.

బఫే లంచ్‌లో పసుపు రంగు అన్నం, పాస్తా, కస్ కస్, నూరిన ఎండుమిర్చి పచ్చడి, పల్చటి దాల్‌సూప్, బ్రెడ్ హల్వా, వెజిటబుల్ సలాడ్, పెరుగు ఉన్నాయి. చికెన్, మటన్ ఫ్రైడ్ రైస్‌లు నాన్ వెజిటేరియన్స్‌కి ఉన్నాయి. ఫలాఫెల్‌ని (సెనగపప్పుతో వెజిటబుల్ బుల్లెట్స్‌లా చేసే మిడిల్ ఈస్ట్ వంటకం) బాణలిలో అప్పటికప్పుడు వేయించి ఇస్తున్నారు. దాన్ని అన్నంలో కలుపుకోవచ్చని ఆశపడ్డాను. కానీ మాంసం వేయించిన నూనెలోనే వాటినీ వేయిస్తున్నారని చంద్ర చెప్పడంతో వాటిని తీసుకోలేదు. పచ్చి కేబేజి తురుము చాలా నాణ్యంగా ఉండబట్టి దాన్ని అన్నంలో కలుపుకుని తింటే చాలా రుచిగా అనిపించింది. శాఖాహారులకి ఇంకేం లేవు. పథ్నాలుగు మంది తిన్నాక జీనత్ హోటల్ బిల్ మీద సంతకం చేసింది. ట్రావెల్ ఏజెన్సీ తర్వాత దాన్ని చెల్లిస్తుంది.


నేలలో పొయ్యిని తవ్వి కూరగాయలు, మాంసం వండటం జోర్డాన్ ప్రత్యేకత అని అమెరికన్ ఫుడ్ ఛానల్‌లో చూసాను. ప్రపంచ జనాభాలోని 50కోట్ల మంది ఎడారుల్లోనే నివసిసితున్నారు.

భోజనం అయ్యాక తిరిగి వచ్చిన దారి పట్టాం. పదేళ్ళ ఓ స్థానిక పాప ఏదో కొనమని నాదగ్గరికి వచ్చి కోరింది. పేరు అడిగితే దీమ అని చెప్పింది. ఆ పాప ఫొటో తీసి చూపిస్తే ఆనందంగా చూసింది. తిరిగి వెళ్ళేప్పుడు ఓ పదేళ్ళ కుర్రాడు గుర్రం మీద వెళ్తూ ఆగి పద్మజని గుర్రం ఎక్కమంటే 'ఐ హేవ్ స్ట్రాంగ్ లెగ్స్' అని చెప్పింది.

"బట్ దిస్ హేజ్ ఫోర్ లెగ్స్" అని ఠక్కున జవాబు చెప్పాడు. చెప్పాగా వీళ్ళు చాలా తెలివైన వాళ్ళని.

పోలీస్ వేన్స్ పహారా తిరుగుతూ కనిపించాయి. అక్కడక్కడా షెడ్ల కింద కూడా పోలీస్ వేన్స్ కనిపించాయి. పరిమితి మించిన వేగంతో వెళ్ళేవాళ్ళని పట్టుకోడానికి అని జీనత్ చెప్పింది. మళ్ళీ కాలినడకన ట్రెజరీకి చేరుకున్నాక అంతా తమ గుర్రపు బళ్ళకోసం ఆగారు. జీనత్ ఓ బండి ఎక్కి వెళ్ళిపోయింది. బండిమీద రమ్మని చాలామంది బళ్ళవాళ్ళు అరుస్తున్నారు. మేమిద్దరం, హైదరాబాద్ నించి వచ్చిన ఇద్దరు రెడ్డిగార్లు నడకకి ఆ దారి అద్భుతంగా ఉండటంతో కాలినడకన వెనక్కి బయలుదేరాం. అమెరికా, చైనా, యూరప్‌ల నించి వచ్చిన అనేకమంది సందర్శకులు దారిలో కనిపించారు. దూరంగా ఉండటంతో మేం అక్కడ చూడనివి కసర్ అల్‌బింట్, ది రాయల్ టోంబ్స్, పెట్రా ఆర్కియాలజికల్ పార్క్.

మిట్టమధ్యాహ్నం కావడంతో 42 డిగ్రీల సెల్సియస్ వేడిలో వెళ్ళేప్పటి కంటే తిరిగి వచ్చేప్పుడు నడక కష్టం అనిపించింది. ఇంకో ఐదు నిమిషాల్లో బయటకి వస్తామనగా ఓ షెల్టర్ కనపడటంతో పద్మజ అక్కడ కొద్దిసేపు కూర్చుండిపోయింది. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నాక రెడ్డిగార్లు ఇద్దరు ముందుకి సాగారు. మేము పెత్రా శిథిల నగర ఎంట్రన్స్‌లోంచి బయటకి వచ్చి ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ని చేరుకునేసరికి రెండుంపావైంది.



జీనత్

వచ్చే ప్రతీ ప్రయాణికుడిని ఓ షాపు అతను విసుగు లేకుండా 'వెల్‌కం బేక్. థర్స్టీ? టేక్ కూల్ డ్రింక్' అని ఆహ్వానిస్తున్నాడు. మేము తీసుకెళ్ళిన మంచి నీళ్ళు అయిపోయాయి. 250 ఎం.ఎల్.డైట్ పెప్సీ ఒక డాలర్. ఆరెంజ్, కేరట్ జ్యూస్ ఒక డాలర్. జోర్డాన్ మొత్తానికి బహుశా ఇంత చవకగా కూల్ డ్రింక్స్ అమ్మేది అతనే అనుకుంటా. ఆ షాపు బయట కుర్చీల్లో కూర్చుని నేను డైట్ పెప్సీని, పద్మజ కేరట్ జ్యూస్‌ని తాగుతూ వేచి ఉన్నాం. 2-50 దాకా మిగిలిన వాళ్ళ బళ్ళు రాలేదు. బండి వాళ్ళు అనేక ట్రిప్స్ వేస్తూండడంతో మా వాళ్ళు వేచి ఉండాల్సి వచ్చింది. ఐదు నిమిషాలు తక్కువ మూడుకి జీనత్ వెదుక్కుంటూ మా దగ్గరికి వచ్చింది. ఆమెకి కూల్ డ్రింక్ ఆఫర్ చేస్తే ఐస్ క్రీం తింటానని చెప్పింది. ఒక డాలర్‌కి ఐస్ క్రీం కొనిచ్చాను.

అంతా రాగానే 3 -05 కి మా వేన్ దగ్గరికి చేరుకున్నాం. జీనత్ ఓ పోలీస్‌ని 'నో పార్కింగ్ ఏరియా'లో మా కోసం వేన్‌ని కొద్దిసేపు ఆపేందుకు అనుమతి అడిగి తీసుకుంది. అంతా ఎక్కాక వేన్ బయలుదేరింది.



మోజెస్ స్ప్రింగ్ నించి వచ్చే నీళ్ళు

'మరణానికి మునుపు చూడాల్సిన ప్రదేశాల్లో' పెత్రా అనేక జాబితాల్లో ఉంది. 102 చదరపు మైళ్ళ విస్తీర్ణంలో ఏంఫీ థియేటర్స్, కొండల్లో చెక్కిన పురాతన సమాధులు, విగ్రహాలు గల పెత్రా శిథిలనగరాన్ని ఇంకా పూర్తిగా కనుగొనలేదు. పాశ్చాత్యులు తవ్వకాలని ఇంకా కొనసాగిస్తున్నారు. కొన్ని సంవత్సరాల తర్వాత మళ్ళీ వచ్చే పర్యాటకులకి ఇక్కడ తాము పూర్వం చూడనివి ఎన్నో కనిపిస్తాయి.

పది నిమిషాల తర్వాత మా వేన్ రోడ్డుకి కుడివైపు ఆగింది. మోజెస్ స్ప్రింగ్ నించి వచ్చే నీటిని అక్కడ పట్టుకోవచ్చని గైడ్ చెప్పింది. అలసిపోవడంతో ఎవరూ దిగలేదు. నేను రోడ్డు దాటి వెళ్ళి ఖాళీ అయిన మూడు వాటర్ బాటిల్స్‌లో ఆ నీళ్ళు పట్టుకొచ్చాను. లోపల సిమెంట్‌తో కట్టిన చిన్న కాలువకి స్ప్రింగ్ లోంచి వచ్చే నీరు సదా పారుతూంటుంది.

నీళ్ళు పట్టుకుని నేను ఎక్కాక మళ్ళీ వేన్ బయలుదేరింది. దారిలో అటు, ఇటు వెల్డింగ్ దుకాణాలు, క్షవరశాలలు చూస్తే తెనాలి, పొన్నూరు లాంటి ఊళ్ళు గుర్తొచ్చాయి. ట్రాఫిక్ రద్దీలేదు. రాత్రి ఏడున్నరకి మా వేన్ అమ్మన్‌కి చేరుకున్నాక, జమ్ము అండ్ కాశ్మీర్ రెస్టరెంట్ ముందు భోజనానికి ఆగాం. అందులో పని చేసే ఒకతను ఇరానియన్. మిగతా అందరూ ఈజిప్షియన్స్. ఎవరికి ఏం కావాలో అవి ఆర్డర్ చేసుకోమని జీనత్ చెప్పింది. ఆరుగురం వెజిటేరియన్స్ కలిసి వెజిటబుల్ బిర్యానీ, వెజ్ దాల్ ఫ్రై, రోటీలని ఆర్డర్ చేసాం. మా పక్కన కూర్చున్న డ్రైవర్ రోటీ, మటన్ కర్రీ, బిర్యానీ, సూప్‌లని ఆబగా ఆర్డర్ చేసి చివరికి బిర్యానీని వదిలేసాడు. అది గమనించి నేను జీనత్‌ని ఆ బిర్యానీని ఇంటికి పార్సెల్ పట్టుకెళ్ళమని సూచిస్తే తీసుకెళ్ళింది. భోజనం చేసి వేన్ ఎక్కాక జీనత్ మైక్‌లో చెప్పింది.

"రేపు ఉదయం మీకు ఆరుకి వేకప్ కాల్. బ్రేక్ ఫాస్ట్ ఏడుకి. ఉదయం ఎనిమిదికల్లా మిమ్మల్ని ఎయిర్‌పోర్ట్‌కి తీసుకెళ్ళడానికి ఇదే వేన్‌లో డ్రైవర్ తలత్ మీ హోటల్‌కి వస్తాడు. నేను రాను. మీరు వచ్చినప్పుడు ఎయిర్‌పోర్ట్‌లో మిమ్మల్ని రిసీవ్ చేసుకున్న మిస్టర్ జిహాదే మళ్ళీ ఎయిర్‌పోర్ట్‌లో కలుస్తాడు. రేపు నేను ఇక మీకు కనపడను. విష్ యు ఆల్ సేఫ్ అండ్ హేపీ జర్నీ. మీ అందరికీ గుడ్ బై.

మేము హోటల్ డేస్ ఇన్‌కి చేరుకునేసరికి రాత్రి తొమ్మిదైంది. మా రూం నంబర్ 303.

మనుషుల్లో నాలుగు రకాల వాళ్ళుంటారు. మొదటి రకం వారు పైసా ఖర్చు చేయరు. అన్ని ఖర్చులని ఎవాయిడ్ చేయాలనే చూస్తారు. రెండో రకం వారు తమకోసం ఖర్చు చేయరు. నాలుగో రకం వారు తరతమ భేదం లేకుండా తమకి, ఇతరులకి కూడా డబ్బు ధారాళంగా ఖర్చు చేస్తారు.

అలసిపోయిన పద్మజ తాళం చెవి తీసుకుని గదికి వెళ్ళిపోయింది. రిసెప్షన్‌లో చంద్ర గైడ్‌కి, డ్రైవర్‌కి రోజుకి నాలుగు డాలర్ల చొప్పున టిప్ ఇవ్వాలని అందరినించీ సేకరించి ఇచ్చే బాధ్యతని తీసుకుంది. ఆశ్చర్యంగా అందరికన్నా ఎక్కువ ఖర్చు చేసిన మిసెస్ చందన అగర్వాల్, 'మాకు ఈ విషయం ఎస్. ఓ.టి.సి వారు చెప్పలేదు' అని ఇవ్వడానికి నిరాకరించింది. చంద్రకి మా బ్రోషర్‌లో అది రాసి ఉందని సూచించాను. దాన్ని చందనికి చూపిస్తే ఎర్రబడ్డ మొహంతో అయిష్టంగా ఇచ్చింది. ఇంగ్లీష్‌లో కొద్దిసేపు జరిగిన మా ఈ చర్చ విని జీనత్ చాలా అవమానపడింది. సిగ్గుపడుతూనే డబ్బు తీసుకుంది.

మూడు రోజులకి 4డాలర్ల చొప్పున మా ఇద్దరికీ కలిపి 24డాలర్లని చంద్రకి ఇచ్చాను డ్రైవర్‌కి జీనత్‌కి చెరో పదిడాలర్లు నా వ్యక్తిగత టిప్‌గా ఇచ్చాను. ఈ గొడవ ముగిసాక మా గది నంబర్ తెలియని నేను పద్మజ అందరితోపాటు లిఫ్ట్ బయట కారిడార్‌లో వేచి ఉంటుందని నిన్న రిసెప్షన్‌లో వదిలిన సూట్‌కేసులతో ఐదో అంతస్థులోకి వెళ్ళాను. అక్కడ కనపడకపోవడంతో రిసెప్షన్‌కి మళ్ళీ సామానుతో తిరిగి వచ్చి మా రూం నంబర్ 303 అని తెలుసుకున్నాను. మళ్ళీ లిఫ్ట్‌లో మూడో అంతస్థుకి వెళ్ళి తలుపు కొడితే పద్మజ తీయలేదు. 304లోంచి బయటికి వచ్చిన చంద్రని నా సూట్‌కేస్‌లని వాళ్ళ గదిలో తాత్కాలికంగ ఉంచచ్చా అని అడిగాను. ఆవిడ తన హేండ్ బేగ్‌ని రిసెప్షన్‌లో మర్చిపోయానని, అదిపోయిందేమో అనే భయంతో నేను చెప్పేది వినకుండా వెళ్ళిపోయింది. ఈలోగా నాకోసం రిసెప్షన్‌కి వెళ్ళిన పద్మజ తిరిగి రూం దగ్గరికి వచ్చింది.

ఆశ్చర్యంగా ఆ గది తలుపు తీయగానే మేన్ హోల్ డ్రైనేజ్ కేప్ ఎదురుగా కనిపించింది. అది కదులుతూండటంతో దాంట్లో కాలు పడితే ఫ్రాక్చర్ కూడా అవచ్చు. ఇది త్రీ స్టార్ హోటల్ కూడా కాదు. కిచెనెట్‌లో స్టవ్ మొదలైనవి ఉన్నా, గదిలో కాఫీ, టీలని కూడా ఉంచలేదు. సామాను సర్దుకుని పడుకున్నాం.

వివిధ దేశాల్లోని ప్రజలు ఎంత శాంతియుతంగా జీవిస్తున్నారు అన్న అంశం మీద ఏటాపీస్ గ్లోబల్ ఇండెక్స్ అవే అంతర్జాతీయ సంస్థ కొన్ని ప్రమాణాలతో సర్వే చేసి ప్రపంచ దేశాలకి రేటింగ్‌ని ఇస్తూంటుంది. 2015కి జోర్డాన్‌కి ఇచ్చిన రేంక్ 56. ఇండియా రేంక్? 144 వ రేంక్ ఇచ్చారు. దీన్ని బట్టి ఐసిస్ స్థావరమైన సిరియా సరిహద్దులోని జోర్డాన్ దేశ ప్రమాణాలని అర్థం చేసుకోవచ్చు. ఇందుకు కారణం దాన్ని పాలించే నియంత్ కింగ్ అబ్దుల్లా. ప్రపంచంలో వేళ్ళ మీద లెక్కపెట్టదగ్గ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా గల నియంతల్లో ఒకడు కింగ్ అబ్దుల్లా.

1999లో కింగ్ హుస్సేన్ ఆరోగ్యం క్షీణించడంతో, అతని వారసుడు చిన్నవాడు అవడంతో, జోర్డాన్ స్పెషల్ ఫోర్సెస్‌కి కమాండర్‌గా ఉన్న అబ్దుల్లాని తన వారసుడిగా ప్రకటించాడు. జోర్డాన్‌ని అబ్దుల్లా అనేక విధాల అభివృద్ధి చేసాడు. మహిళ స్థాయిని కూడా పెంచాడు. సైన్యాన్ని అప్‌గ్రేడ్ చేసి సరిహద్దులోని సిరియాలాంటి వివాదాస్పద దేశాలతో శాంతిని నెలకొల్పాడు.

ఈ శతాబ్దంలో బోట్స్‌వానా నియంత ఖామా, టర్కీ నియంత ముస్తాఫా కేమెల్ అటాటర్క్ కూడా ప్రజారంజకంగా పాలించిన నియంతలు. మిగిలిన వారంతా స్వార్థపరులు, అసమర్థులు, ప్రజా సంక్షేమాన్ని ఖాతరు చేయనివారే. మనదేశంలోని ఇలాంటి ప్రజాస్వామ్య నియంతలు గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. వారి పేర్లు మీకు తెలుసు.

మేము వెళ్ళబోయే ఈజిప్ట్ రేంక్ 143. అంటే మనిషి కష్టపడే దేశం. దాని పీస్ గ్లోబల్ ఇండెక్స్ రేంక్ మన దేశం కన్నా ఒకటి తక్కువ.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

www.anandbooks.com
www.telugubooks.in
*ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి*